సాక్షి ప్రకాశం

ఆదివారం । 31 । ఆగస్టు । 2025



పది కిలోమీటర్లు పడిలేవాల్సిందే !

కందుకూరు నుంచి పొన్నలూరు మండలం ముత్తరాసుపాలెం వరకు ఉన్న ఓవీ రోడ్డు అడుగడుగునా గుంతలు పడి ప్రమాదాలకు నిలయంగా మారింది.

- 8లో..



కార్పొరేట్లకు పంట భూములు

పంట భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరిని ప్రజలు వ్యతిరేకించాలని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర స్థాయి సమావేశంలో వక్తలు పేర్కొన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
33 /23

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

నల్లమలలో గుండ్లకమ్మ ఉధృతి



నెమలిగుండ్లరంగనాయకస్వామి దేవస్థానం వద్ద నీటిగుండంలో దూకుతున్న గుండ్లకమ్మ

రాచర్ల: గుండ్లకమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దర్శనం కోసం వెళ్లిన భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో గుండ్లకమ్మ పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో శనివారం నెమలిగుండ్ల రంగనాయకస్వామి దర్శనం కోసం వెళ్లిన భక్తులకు నిరాశ ఎదురైంది. దీంతో దేవస్థానం కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్యతో పాటు ఏఎస్సై ఆదిశేషయ్య ట్రాక్టర్లు ఏర్పాటు చేసి భక్తులను తరలించి స్వామివారి దర్శనం చేయించారు. గుండ్లకమ్మవాగు సరిసర ప్రాంతాలతో పాటు దేవస్థానం సమీపంలోని నీటి గుండం వద్ద భక్తులు స్నానాలు చేయకుండా దేవస్థానం సిబ్బందితో పాటు పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.

రంగస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి దర్శనం కోసం గంటల తరబడి క్యూలో నిలబడి స్వామివారి దర్శనం చేసుకున్నారు. తొలుత దేవస్థానం అర్చకులైన అన్నవరం సత్యనారాయణ చార్యులు, అన్నవరం పాండురంగాచార్యులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.



స్వామి దర్శనం కోసం ట్రాక్టర్‌లో వెళ్తున్న భక్తులు

మార్కెట్ యార్డ్ చైర్మన్ల నియామకం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తప్పు మీద తప్పులు చేస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు అయిన స్థానాల్లో ఓసీలకు, బీసీ మహిళ స్థానంలో బీసీ పురుషునికి పదవులు కేటాయిస్తూ రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతోంది. ఒక చేత్తో 77 చట్టం ప్రకారం నియామకాలు చేపట్టాల్సిందిగా ఉత్తర్వులిచ్చి మరో చేత్తో అదే చట్టాన్ని ఉల్లంఘిస్తూ చైర్మన్లను నియమించి న్యాయస్థానంలో దోషిగా చేతులు కట్టుకొని నిల్చుంది. జీఓలో ఒకలా, కోర్టుకు మరోలా చెబుతూ తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



- మార్కెట్ యార్డు చైర్మన్ల నియామకంలో రిజర్వేషన్లకు మంగళం
- రిజర్వు స్థానాలు అగ్రవర్ణాలకు
- ఎస్సీకి రిజర్వ్ అయిన దర్శి, కనిగిరిల్లో ఓసీకి
- ఎస్టీకి రిజర్వ్ అయిన యర్రగొండపాలెం సీటులో ఓసీ
- బీసీ మహిళకు రిజర్వ్ చేసిన పొదిలిలో బీసీ పురుషుడికి
- యర్రగొండపాలెం మార్కెట్ యార్డు చైర్మన్ నియామకంపై కోర్టుకు
- కౌంటర్ దాఖలు చేయకుండా తాత్సారం చేస్తున్న ప్రభుత్వం
- కోర్టును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తోందని పిటిషనర్ల ఆరోపణ
- కూటమి ప్రభుత్వ తీరుపై ఎస్సీ, ఎస్టీ సంఘాల మండిపాటు

రిజర్ వేషాలు !

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లాలో మార్కెట్ యార్డు చైర్మన్ పదవులను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసింది. ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ లకు 50 శాతం రిజర్వేషన్ ప్రకారం భర్తీ చేయాలని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం చట్టం చేసింది. ఈ చట్టం నంబర్ 77 ప్రకారం మార్కెట్ యార్డు చైర్మన్ నియామకాలు చేపట్టాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. చట్టం 77 ప్రకారం రిజర్వేషన్లను పాటించాలని, జనాభా ప్రాతిపదిక, రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లను నిర్ణయించాలని కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది.

ఇంత వరకు బాగానే ఉంది. ఆ తరువాత తతంగం మారి పోయింది. మార్కెట్ యార్డు పదవులకు పోటీ పెరిగింది. ఈ క్రమంలోనే చంద్రబాబు ప్రభుత్వం అడ్డదారులు తొక్కింది. ఏ చట్ట ప్రకారం మార్కెట్ యార్డు చైర్మన్ పదవులను భర్తీ చేయాల్సిందిగా ఉత్తర్వుల జారీ చేసిందో అదే చట్టాన్ని స్వయంగా ప్రభుత్వమే ఉల్లంఘించింది. రాజ్యాంగం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కల్పించిన రిజర్వేషన్ హక్కును కాలరాస్తూ దొడ్డిదారిన నియామకాలు చేపట్టింది. కేవలం రిజర్వేషన్ స్థానాల్లో మాత్రమే అగ్రకులాలకు పదవులు కట్టబెట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి ఆరె రమణయ్య, మరో ఇద్దరు గిరిజన సంఘాల నాయకులు కోర్టుకు వెళ్లడంతో కూటమి ప్రభుత్వ నిర్వాకం బయట పడింది. ఇదిలా ఉండగా ఈ పదవుల పంపకాల విషయంలో కొంతమంది అధికార కూటమి ఎమ్మెల్యేలు ఈ పదవులను అమ్ముకున్నారని, మరి కొంతమంది తమ అనుచరులకు కట్టబెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి.

కోర్టు విచారణలో ఏం జరిగిందంటే...

ఎస్టీకి కేటాయించిన స్థానంలో ఓసీ అభ్యర్థిని నియమించడం చెల్లదని, తదుపరి విచారణ జరిగేంత వరకు సదరు అభ్యర్థి పదవిని చేపట్టకూడదని, మార్కెట్ యార్డు కార్యాలయానికి వెళ్లకూడదని కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. యర్రగొండపాలెం మార్కెట్ యార్డు చైర్మన్ పదవిపై ఈ నెల 4వ తేదీన తొలుత వాదనలు జరిగాయి. మార్కెట్ యార్డు చైర్మన్‌గా పదవి బాధ్యతలు స్వీకరించాడు కనుక అతడినే కొనసాగించాలని ప్రభుత్వం తరఫున న్యాయవాది వాదించారు. అయినా కోర్టు సమ్మతించలేదు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా ఆదేశించిన కోర్టు ఈ నెల 20 కు వాయిదా వేసింది. చైర్మన్ నియామకం విషయంలో తప్పులో కాలేసిన ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసేందుకు వెనకాడుతోంది. సకాలంలో కౌంటర్ దాఖలు చేయలేదు. దాంతో కోర్టు ఈ కేసును సెప్టెంబర్ 1వ తేదీకి వాయిదా వేసింది.

కోర్టును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు..

నిజానికి జిల్లా యూనిట్‌గా తీసుకొని రిజర్వేషన్ల ప్రకారం మార్కెట్ యార్డు చైర్మన్ పదవులను భర్తీ చేయాలని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులో స్పష్టంగా పేర్కొంది. ఇప్పుడు రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకొని రిజర్వేషన్ అమలు చేస్తామని కోర్టులో చెబుతోంది. ఇది కోర్టును తప్పుదోవ పట్టించడమేనని పిటిషనర్ ఆరె రమణయ్య చెబుతున్నారు. ప్రభుత్వం చెప్పినట్లు ఒకవేళ రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకొని రిజర్వేషన్ అమలు చేయాలంటే ఇప్పుడు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాల్సి ఉంటుందని, తాజాగా మళ్లీ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఆర్‌ఓఆర్ ప్రకారం ప్రస్తుతం ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్ల నియామకాలను కూడా రద్దు చేసి మళ్లీ కొత్తగా ఉత్తర్వులను ఇవ్వాల్సి ఉంటుందని వాదిస్తున్నారు. అంతే కాకుండా 77 చట్టం ప్రకారం రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసిందని, ప్రభుత్వ నిర్వాకంతో చైర్మన్ నియామకాలకు సంబంధించి సాక్షాత్తు కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులకు విలువ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎప్పుడూ ఇలా జరిగిన దాఖలాలు లేవంటున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల ప్రకారం చైర్మన్ నియామకాలు చేపట్టాలని, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

రిజర్వేషన్లకు గండి



కలెక్టర్ జారీ చేసిన మార్కెట్ యార్డు చైర్మన్ల రిజర్వేషన్ ఉత్తర్వులు

జిల్లాలో మొత్తం 10 మార్కెట్ యార్డులున్నాయి. అందులో ఐదు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు కేటాయిస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా లాటరీ ద్వారా రిజర్వేషన్ నిర్ణయించారు. యర్రగొండపాలెం ఎస్టీ, దర్శి, కనిగిరి ఎస్సీ, పొదిలి మైనార్టీ మహిళ, ఒంగోలు, గిద్దలూరు బీసీ జనరల్‌కు కేటాయిస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఓపెన్ కేటగిరీలో కేటాయించిన చైర్మన్ పదవులను వారితోనే భర్తీ చేసిన కూటమి ప్రభుత్వం రిజర్వేషన్ స్థానాల్లో మాత్రం నిబంధనలకు వ్యతిరేకంగా అగ్రకులాలకు కేటాయించింది. ఎస్సీకి కేటాయించిన దర్శిలో దారం నాగవేణి (కాపు), కనిగిరిలో ఎస్సీకి బదులుగా ఏరువ రమాదేవి (కమ్మ), ఎస్టీకి కేటాయించిన యర్రగొండపాలెంలో చేకూరి సుబ్బారావు (కమ్మ), మైనార్టీ మహిళకు కేటాయించిన పొదిలి మార్కెట్ యార్డు పదవి షేక్ ఇమాంసాహెబ్ (మైనారిటీ పురుషుడు) కేటాయించారు. ఇది ముమ్మాటికీ రాజ్యాంగ ఉల్లంఘన మాత్రమే అవుతుందని, దీని వల్ల రిజర్వేషన్ వర్గాలకు రాజ్యాంగం కల్పించి అవకాశం దక్కకుండా పోతుందని ఆరె రమణయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. అధికారం చేతిలో ఉంది కదాని ప్రభుత్వం అడ్డగోలుగా తీసుకున్న నిర్ణయాన్ని కోర్టులో సమర్థించుకోలేక సతమతమవుతోంది.


రాత్రికి రాత్రి పెరిగిన దరఖాస్తులు

- జిల్లాలో 21 బార్లకు డ్రా
- శుక్రవారం రాత్రి 9 గంటల వరకు 91 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పిన ఎక్సైజ్ అధికారులు
- శనివారం ఉదయం 8 గంటలకు 94 దరఖాస్తులకు డ్రా తీసిన వైనం
- మొక్కుబడిగా డ్రా తతంగం



ప్రకాశం భవనంలో బార్లకు డ్రా తీస్తున్న డీఆర్వో ఓబులేసు, డీసీ హేమంత్ నాగరాజు

ఒంగోలు టౌన్: నూతన బార్ల కోసం శుక్రవారం మధ్యాహ్నం కోసం 27 దరఖాస్తులు వచ్చాయని అధికార వర్గాలు ప్రకటించాయి. దరఖాస్తుల స్వీకరణకు ఉన్న ఐదు గంటల్లో ఏకంగా 64 మంది దరఖాస్తు చేసుకున్నట్టు అధికారులు చెప్పుకొచ్చారు. శుక్రవారం రాత్రి 9 గంటల వరకు ఓపెన్ కేటగిరీలో 78, గీతకార్మికుల కేటగిరీలో 13 మొత్తం కలిపి 91 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అయితే శనివారం ఉదయం 94 దరఖాస్తులకు డ్రా నిర్వహించడం గమనార్హం. ఈనెల 13వ తేదీ రాష్ట్ర ప్రభుత్వం 2025–28కి సంబంధించి కొత్తబార్ పాలసీ ప్రకటించింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో 18వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించడం మొదలు పెట్టింది. 26వ తేదీ నాటికి గడువు ముగుస్తుందని, 28వ తేదీ డ్రా నిర్వహిస్తామని అధికారులు తొలుత ప్రకటించారు. ప్రభుత్వం ఆశించిన మేర దరఖాస్తులు రాలేదు. దాంతో మరో మూడు రోజుల గడువు పెంచి ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించారు. అయినా దరఖాస్తులు రాకపోవడంతో ఎక్సైజ్ అధికారులు పాత వ్యాపారులపై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. శుక్రవారం మధ్యాహ్నం వరకూ కేవలం 27 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. సమయం ముగిసే సమయానికి ఆ సంఖ్య 91కి చేరింది. శనివారం ఉదయం 8 గంటలకు ప్రకాశం భవనంలోని స్పందన హాలులో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ అధికారులు డ్రా నిర్వహించారు. ఓపెన్ కేటగిరీలో 26 బార్లు, గీత కార్మికులకు కేటాయించిన 3 బార్లకు ఒకేసారి డ్రా నిర్వహించారు. ఓపెన్ కేటగిరిలో ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో 16 బార్లకు గాను 11 బార్లకు, మార్కాపురం 2, చీమకుర్తి, పొదిలి, దర్శి, కనిగిరి, గిద్దలూరు ఒక్కొక్కటి చొప్పున 18 బార్లకు డ్రా తీశారు. గీత కార్మికుల కేటగిరీలో ఒంగోలు 1, మార్కాపురం 2 బార్లకు కూడా డ్రా నిర్వహించారు. డీఆర్వో చిన ఓబులేసు చేతులమీదుగా డ్రా తీశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు మాట్లాడుతూ... ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేర దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా డ్రా నిర్వహించామన్నారు. సెప్టెంబర్ 1 నుంచి బార్లు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఇదిలా ఉండగా మిగిలిన 8 బార్లకు గాను దరఖాస్తుల స్వీకరణకు సెప్టెంబర్ 1వ తేదీ వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొందని, ఆసక్తి కలిగిన వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎక్సైజ్ ఈఎస్ షేక్ ఆయేషా బేగం కోరారు. ఈ డ్రాలో అసిస్టెంట్ కమిషనర్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు. 94 దరఖాస్తులు వచ్చినప్పటికీ డ్రాలో పాల్గొనేందుకు వ్యాపారులు నామమాత్రంగా మాత్రమే హాజరుకావడం గమనార్హం. దాంతో డ్రా వ్యవహారం ఒక తంతులాగా సాగిందని గుసగుసలు వినిపిస్తున్నాయి.



ఒంగోలు చివుకులవారి వీధిలో సహస్రదీప అలంకరణలో వినాయకుడి విగ్రహం

గణాధ్యక్షాయ ధీమహీ..

ముజ్జగములనేలే బొజ్జగణపయ్యను రోజుకో రీతిగా భక్తులు అర్చిస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా ఒంగోలు నగరంలో ఏర్పాటు చేసిన మండపాలను రోజూ ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుంటున్నారు.

న్యూస్‌రీల్

నాటుబాంబు కొరికి కుక్క మృతి

- గోగులదిన్నెలో నాటుబాంబు కలకలం



బాంబు పేలి మృతి చెందిన కుక్క

మార్కాపురం: నాటుబాంబు కొరికి కుక్క మృతిచెందిన ఘటన మార్కాపురం మండలం గోగులదిన్నెలో శనివారం జరిగింది. పోలీసు కథనం మేరకు గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపంలోని ఖాళీ స్థలంలో ఉన్న నాటుబాంబును తినే పదార్థం అనుకుని కుక్క నోటపట్టుకుని వచ్చి రోడ్డుపై కొరికింది. దీంతో పెద్ద శబ్దంతో బాంబు పేలడంతో కుక్క తల ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందింది. భారీ శబ్దం రావడంతో గ్రామస్తులంతా ఉలిక్కిపడి ఘటనా స్థలానికి చేరుకున్నారు. సమీపంలో ఇంకా ఏమైనా ఉన్నాయా అని వెతికారు. సమాచారం అందుకున్న మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పందుల కోసం ఎవరైనా నాటుబాంబు పెట్టి ఉండవచ్చని భావిస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆర్ఐఈసీసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో దోర్నాల విద్యార్థిని ప్రతిభ

- స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన అంజన షణ్ముఖ ప్రియ



పెద్దదోర్నాల: ఇంటర్మీడియెట్ అర్హతతో ఇంటిగ్రేటెడ్ డిగ్రీ, పీజీ, ప్రవేశాల కోసం దేశ వ్యాప్తంగా ఎన్‌సీఈఆర్టీ నిర్వహించే ఆర్ఐఈసీఈఈ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాల్లో పెద్దదోర్నాల మండలం రామచంద్రకోటకు చెందిన కర్రా అంజన షణ్ముఖ ప్రియ ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ ఫిజిక్స్, ఎంఎస్సీ మ్యాథమెటిక్స్, ఎంఎస్సీ కెమిస్ట్రీ మూడు విభాగాల్లో స్టేట్‌లో మొదటి ర్యాంకు, ఇంటిగ్రేటెడ్ బీఈడీ ఫిజికల్ సైన్స్ రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు, ఆల్ ఇండియా 24వ ర్యాంకు, ఇంటిగ్రేటెడ్ బీఈడీ జనరల్ విభాగాల్లో రాష్ట్ర స్థాయి 2వ ర్యాంకు, ఆల్ ఇండియాలో 25వ ర్యాంకు కైవసం చేసుకుంది.

అనుబంధంపై గొడ్డలి వేటు

- వందల ఏళ్ల నాటి రావిచెట్టు తొలగింపు



రావిచెట్టును పెకలించడంతో ఏర్పడిన గుంత

ఒంగోలు సబర్బన్: వందల ఏళ్ల నాటి చరిత్ర ఉన్న ఆ రావిచెట్టుతో ఆ ప్రాంత ప్రజలకు ఎనలేని అనుబంధం ఉంది. ఆ ప్రాంతంలో ఏ హిందువు ఇంట పెళ్లి జరిగినా దేవునికి పెట్టుకుని ఊరేగింపుగా ఆ చెట్టు దగ్గరకు వచ్చి పూజలు చేసేవారు. ఒంగోలు నగరంలోని మంగమూరు రోడ్డులో గాయత్రి మందిరం వద్ద రోడ్డు పక్కన ఉన్న ఈ రావిచెట్టును ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉందన్న సాకు చూపి నగర పాలక సంస్థ అధికారులు శనివారం వేళ్లతో సహా పెకళించారు. దీంతో విశ్వహిందూ పరిషత్, హిందూ ధార్మిక సంస్థలు, బీజేపీ నాయకులు ఆందోళనకు దిగారు. లాయర్‌పేట రైతు బజారు నుంచి మంగమూరు రోడ్డు జంక్షన్ వరకు రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి అభివృద్ధి చేసేందుకు మున్సిపల్ అధికారులు పనులు చేపట్టారు. ఈ రోడ్డులో అడ్డంగా ఉండటంతో పెద్ద రావి చెట్టును పెకళించి పక్కనే ఉన్న గాంధీ పార్కులో పాతారు. ఏళ్ల తరబడి ఆ రావిచెట్టుకు మొక్కులు తీర్చుకుంటూ, ప్రదక్షిణలు చేస్తూ భక్తిభావంతో పూజలు చేస్తున్న స్థానికులు చెట్టు తొలగింపుపై తీవ్ర ఆవేదన చెందారు. చెట్టును అర్థంతరంగా తొలగించటం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని వీహెచ్‌పీ నాయకులు ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సంఘటన స్థలానికి చేరుకుని వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.

కాయ్ రాజా కాయ్

- యరజర్ల గ్రామ శివారులో టీడీపీ నాయకుల కనుసన్నల్లో పేకాట డెన్
- రోజూ లక్షల్లో చేతులు మార్చిడి
- ఎస్పీ ఆదేశాలతో పేకాట శిబిరంపై దాడి
- పట్టుబడిన ఆరుగురు టీడీపీ కార్పొరేటర్లు

సాక్షి టాస్క్‌ఫోర్స్: యరజర్ల గ్రామ శివారులో టీడీపీ నేతల కనుసన్నల్లో పేకాట శిబిరాలు రోజూ విచ్చలవిడిగా సాగుతున్నాయి. పోలీసులకు రూ.లక్షల్లో ముడుపులు అందుతుండటంతో దర్జాగా పట్టపగలే పేకాట డెన్లు నడుస్తున్నాయి. యరజర్ల గ్రామ శివారులో ఊహించని రీతిలో ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పోలీసుల దాడుల్లో 25 మంది జూదరుల వద్ద రూ.48 లక్షల డబ్బులు, కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆరుగురు ఒంగోలు నగర కార్పొరేటర్లు, టీడీపీ నాయకులు, పేకాట శిబిరాలు డబ్బులు అందించే ఫైనాన్సర్లు నలుగురు పట్టుపడినట్లు విశ్వసనీయ సమాచారం. పేకాట శిబిరం వద్ద టంగుటూరు, ఒంగోలు పోలీసులకు మధ్య పేకాట శిబిరం మా పరిధిలో అంటే మా పరిధిలో అని ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో నలుగురు ఫైనాన్సర్లు తప్పించుకున్నట్లు విశ్వసయ సమాచారం . అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో తూర్పునాయుడుపాలెం గ్రామానికి చెందిన దామచర్ల అనీల్‌తో సహా ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2.03 లక్షల నగదు, ఏడు సెల్ ఫోన్లు, ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి మమ అనిపించారు.

క్లుప్తంగా

చివరకు ప్రాణం పోయింది

● ట్రాక్టర్‌ను లారీ ఢీకొన్న ఘటనలో చికిత్స పొందుతూ మహిళా కూలీ మృతి



జొన్నలగడ్డ మీరమ్మ

బల్లికురవ: పొట్ట కూటి కోసం సుబాబుల్ కర్ర కొట్టి ట్రాక్టర్‌కు లోడ్ చేస్తుండగా వెనుక నుంచి గ్రానైట్ లారీ ఢీకొన్న ఘటనలో మహిళా కూలీ జొన్నలగడ్డ మీరమ్మ (53) మృతి చెందింది. శుక్ర వారం రాత్రి బల్లికురవ-సంతమాగులూరు ఆర్ అండ్‌బీ రోడ్డులోని కొత్తమల్లాయపాలెం బస్టాండ్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. బల్లికురవ ఎస్సీకాలనీకి చెందిన జొన్నలగడ్డ మీరమ్మ (53) పందిరి చిన సుబ్బయ్య, కొత్తపల్లి యేసమ్మ, గంధం మీరమ్మ, కొత్తపల్లి చినకోటి, పందిరి సుబ్బారావు సుబాబుల్ కర్రకొట్టి ట్రాక్టర్‌కు రోడ్డు మార్జిన్‌లో లోడింగ్ చేస్తున్నారు. ఆ సమయంలో పాతమల్లాయపాలెం గ్రామానికి చెందిన గ్రానైట్ లారీ ఈర్లకొండ వద్దకు వెళ్తూ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. కొత్తపల్లి చినకోటి, పందిరి సుబ్బారావు మినహా మగిలిన నలుగురు గాయాలపాలయ్యారు. నరసరావుపేటలో చికిత్స పొందుతూ మీరమ్మ మృతి చెందింది. కొత్తపల్లి యేసమ్మ ఫిర్యాదు మేరకు బల్లికురవ పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. బల్లికురవ ఎస్సీకాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి. మిగతా క్షతగాత్రులకు ప్రాణాపాయం తప్పినట్లు సమాచారం.

టీడీపీ నాయకుడిపై ఫిర్యాదు

ఉలవపాడు: మాజీ ఐఏఎస్ విజయ్‌కుమార్‌పై ఫేస్‌బుక్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసి వ్యక్తిగత దూషణకు పాల్పడిన టీడీపీ నాయకుడిపై అడ్వకేట్ కనపర్తి శ్రీరాములు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉలవపాడుకు చెందిన టీడీపీ నాయకుడు బోగినేని చెంచురామానాయుడు ఫేస్‌బుక్‌లో రిజర్వేషన్ కేటగిరీలో సెలక్ట్ అయిన విజయ్‌కుమార్ పెద్ద పుడింగిలా మాట్లాడుతున్నాడు.. యాక్ థూ.. అని పెట్టడంతో పాటు తాను పెద్దకులం కమ్మవాడిని అంటూ అదే పోస్టులో పెట్టాడు. దీనిపై అడ్వకేట్ శ్రీరాములు టీడీపీ నాయకుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

పది కిలోమీటర్లు పడిలేవాల్సిందే..!

● అధ్వానంగా కందుకూరు-పొన్నలూరు ఓవీ రోడ్డు
● పది కిలోమీటర్ల పొడవున పెద్ద పెద్ద గుంతలు
● అక్కడక్కడా రూపమే కోల్పోయిన రహదారి
● దూబగుంట పొగాకు బోర్డు సమీపంలో కుంగిన చప్టా, రోడ్డు
● చోద్యం చూడటం తప్ప పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
● తరచూ ప్రమాదాలతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వాహనదారులు
● కూటమి ప్రభుత్వంలో రహదారుల దుస్థితిపై అసహనం

పొన్నలూరు:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పనితీరు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైంది. ఏడాదికిపైగా పాలనలో ప్రజలకు ఇచ్చిన సంక్షేమ పథకాల హామీలేవీ అమలు చేయకపోగా, అభివృద్ధి పనులను కూడా సక్రమంగా అమలు చేస్తున్న దాఖలాలు లేవు. కనీసం ప్రధాన రహదారుల అభివృద్ధి పనులను కూడా గాలికొదిలేశారు. వాస్తవంగా రహదారుల అభివృద్ధే తమ ధ్యేయమంటూ.. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపు రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లను నిర్మిస్తామని సీఎం చంద్రబాబు అనేక సభలు, సమావేశాల్లో ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చారు. అయితే, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా నేటికీ ఆ దిశగా చర్యలు తీసుకున్న పాపానపోలేదు. కొత్త రోడ్ల నిర్మాణం దేవుడెరుగు.. కనీసం ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టి వాహనదారుల కష్టాలు తొలగించడంలేదు. కందుకూరు నుంచి పొన్నలూరు మీదుగా కనిగిరి వెళ్లే ఓవీ రహదారి దుస్థితే ఇందుకు నిదర్శనంగా ఉంది. ఈ రోడ్డు ప్రసుత్తం మరీ అధ్వానంగా తయారైంది. ఈ రహదారిపై ప్రయాణమంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు.

కొన్నేళ్ల క్రితం కందుకూరు నుంచి పొన్నలూరు మండల పరిధిలోని ముత్తరాసుపాలెం వరకు ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించారు. ఈ రోడ్డును తూతూమంత్రంగా నాణ్యత లేకుండా నిర్మించడంతో కొన్నేళ్లకే అడుగడుగునా గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. ముఖ్యంగా రోడ్డు మధ్యలో తారు, కంకర లేచిపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు వర్షం పడినప్పుడు, రాత్రి సమయాల్లో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. వేగంగా వచ్చే భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాలకు గుంతల్లో పడిలేస్తూ అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. పది కిలోమీటర్ల పొడవున అడుగడుగునా బ్రేకులు వేయాల్సి వస్తుండటంతో కూటమి ప్రభుత్వ తీరుపై ప్రయాణికులు తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేస్తున్నారు.



దూబగుంట-పొన్నలూరు మధ్యలో పొగాకు బోర్డు దగ్గర కుంగిన చప్టాపై పడిన గుంతలు

రూపం కోల్పోయిన రహదారి...

ఇదిలా ఉంటే ముత్తరాసుపాలెం సమీపంలో మూడు చోట్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిని భారీ గుంతలు ఏర్పడి రూపమే కోల్పోయింది. దీంతో రోడ్డు సరిగా లేకపోవడంతో తరచూ ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతూ ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఇటీవల ఒకేరోజు ముగ్గురు ద్విచక్ర వాహనదారులు ముత్తరాసుపాలెం సమీపంలో ఓవీ రోడ్డుపై గుంతలున్న సంగతి తెలియక వేగంగా వచ్చి ప్రమాదానికి గురయ్యారు. అలాగే ఎదురుగా వాహనం రావడంతో సైడ్ దిగిన కూలీల ఆటో రోడ్డు మార్జిన్ సరిగా లేకపోవడంతో అదుపుతప్పి పడిపోయింది. ఇలా తరచూ ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

దూబగుంట వద్ద కుంగిన చప్టా, రోడ్డు...

కందుకూరు నుంచి పొన్నలూరు మధ్యలో సుమారు 10 కిలోమీటర్ల దూరం ఓవీ రోడ్డు ఉంటుంది. ప్రధాన రహదారి కావడంతో ఈ రోడ్డుపై వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. అయితే, 11 ఏళ్ల క్రితం సింగిల్‌గా ఉన్న రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరించే క్రమంలో దూబగుంట పొగాకు బోర్డు సమీపంలో ఉన్న పాత చప్టా స్థానంలో కొత్తది నిర్మించకుండా దానిపైనే డబుల్ రోడ్డు పనులు చేపట్టారు. దీంతో ఇటీవల ఈ చప్టా కుంగి రోడ్డు మధ్యలో రెండు చోట్ల మూడడుగుల వెడల్పుతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అయితే, ఈ ప్రాంతంలో సంబంధిత అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వేగంగా వచ్చిన వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. కొందరు వాహనదారులు చొరవ తీసుకుని కుంగిన చప్టా దగ్గర కర్రకు తెల్లని సంచి కట్టి ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేశారు. ఓవీ రహదారి ఇంత దారుణంగా ఉండి ప్రజలు చస్తున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు చలించడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని పాలకులు, అధికారులు...

ఓవీ రహదారి కందుకూరు, కొండపి, కనిగిరి నియోజకవర్గాల పరిధిలో ఉండటంతో ప్రతిరోజూ ద్విచక్ర వాహనాలతో పాటు లారీలు, టిప్పర్లు వంటి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే, గత పది నెలలుగా ఓవీ రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడి సైడ్ మార్జిన్లు అధ్వానంగా ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు చూస్తూ ఈ రహదారిపైనే వెళ్తున్నారు తప్ప ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఓవీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



పొన్నలూరు - ముత్తరాసుపాలెం మధ్యలో తారు, కంకర పూర్తిగా లేచిపోయి అధ్వానంగా ఉన్న ఓవీ రోడ్డు



ముత్తరాసుపాలెం-ముప్పాళ్ల అడ్డరోడ్డు దగ్గర ఓవీ రోడ్డుపై ఏర్పడిన గుంతలు



ముత్తరాసుపాలెం ఆంజనేయస్వామి గుడి సమీపంలో రూపమే కోల్పోయిన ఓవీ రోడ్డు

మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో చోరీ

● మహిళ వద్ద రూ.39,500 నగదు మాయం

మార్కాపురం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ ప్రయాణికురాలి పర్సు నుంచి 39,500 రూపాయల నగదు మాయమైంది. ఈ సంఘటన శనివారం జరిగింది. వివరాలు.. పెద్దారవీడు మండలం బద్వీడు చెర్లోపల్లి గ్రామానికి చెందిన కె.రమాదేవీ తన కుమార్తెను ఒంగోలులో దించేందుకు బయల్దేరింది. మార్కాపురం బస్టాండ్‌లో బస్సు ఎక్కే సమయంలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. బస్సులో కూర్చుని పర్సు చూడగానే అందులో ఉన్న నగదు మాయమైంది. దీంతో వెంటనే బస్టాండ్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించారు.

మెరిట్ ఉన్న వారిని ఓపెన్ కేటగిరీ ద్వారానే నియమించాలి

ఒంగోలు వన్‌టౌన్: డీఎస్సీ ఉద్యోగాలలో మెరిట్ ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులను ఓపెన్ కేటగిరీ ద్వారానే నియమించాలని దళిత హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 77 ప్రకారం డీఎస్సీ ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ఏపీడీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రకటించిన విధంగా పోస్టుల భర్తీ చేపట్టడం లేదన్నారు. దీనివలన ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీలలో రిజర్వేషన్ల ప్రకారం రావాల్సిన ఉద్యోగాలు అభ్యర్థులకు రాకుండా తీరని నష్టం జరుగుతోందన్నారు. పారదర్శకంగా నిర్వహించాల్సిన ఉద్యోగాల భర్తీని సీక్రెట్‌గా నిర్వహిస్తున్నారన్నారు. సెలక్షన్ లిస్టు ప్రకటించకుండా ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్ ఎందుకని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు ఈ పరిస్థితిని చక్కదిద్దాలని కోరారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీలు



సంతనూతలపాడు పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ దామోదర్

సంతనూతలపాడు (చీమకుర్తి): పలు పోలీస్ స్టేషన్లను ఎస్పీ ఏఆర్ దామోదర్ శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్కాపురం, పొదిలి, కొనకనమిట్ల, తర్లుపాడు పోలీస్‌స్టేషన్లతో పాటు సంతనూతలపాడు, చీమకుర్తి పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంతనూతలపాడు ఏఎస్ఐ వెంకటరావుతో మాట్లాడి స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. నేరాల నియంత్రణపై సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. చీమకుర్తి మండలంలోని ఆర్.ఎల్.పురం గ్రామ పరిధిలో ఒక గ్రానైట్ క్వారీలో శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదం గురించి చీమకుర్తి సీఐ సుబ్బారావును అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ తనిఖీలలో సీఐ రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు పంట భూములు

● అక్రమంగా అప్పగిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం
● సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ కేంద్ర కార్యదర్శి పీజే జేమ్స్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ కేంద్ర కార్యదర్శి పీజే జేమ్స్

ఒంగోలు టౌన్: పంట భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరిని ప్రజలు వ్యతిరేకించాలని సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ కేంద్ర కార్యదర్శి పీజే జేమ్స్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీపీఐ ఎంఎల్ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికలలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా సామాన్య ప్రజలకు చెందిన భూములను కార్పొరేట్లకు పంచిపెడుతున్నారని ఆరోపించారు. అభివృద్ధి పేరుతో మూడు పంటలు పండే పొలాలను స్వాధీనం చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరేడు భూములను సోలార్ కంపెనీకి కట్టబెట్టే ప్రయత్నాలు విరమించుకోవాలని, లేకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన భూములను లులూ వంటి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే విధానాలకు స్వస్తి పలకాలన్నారు. అమరావతి రైతాంగానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మరో 50 వేల ఎకరాల భూములు సేకరించాలనే ప్రయత్నాలు మంచిది కాదన్నారు. ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి 100 ఏళ్లయిన సందర్భంగా సెప్టెంబర్ 27న జంగారెడ్డిగూడెంలో రాష్ట్ర స్థాయిలో ఫాసిస్టు వ్యతిరేక సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పెరిగిపోతున్న గంజాయి వంటి మత్తు పదార్థాలను అరికట్టాలని, ప్రజలను మద్యానికి బానిసలుగా మారుస్తున్న కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశానికి మన్నవ హరిప్రసాద్ అధ్యక్షత వహించగా రంగనాథం, కొల్లిపర వెంకటేశ్వరరావు, భీమవరపు సుబ్బారావు, వెనిగళ్ల పుష్పలత పాల్గొన్నారు.

రికార్డింగ్ డ్యాన్స్‌లో అపశ్రుతి

● జనరేటర్‌పై పడి డ్యాన్సర్‌కు గాయాలు
● అనుమతి లేకుండానే డ్యాన్స్ ఏర్పాటు
● టీడీపీ నాయకుడి ఆధ్వర్యంలోనే..
● పట్టించుకోని పోలీసులు



ఉలవపాడులో ఏర్పాటు చేసిన రికార్డింగ్ డ్యాన్స్



గాయపడిన డ్యాన్సర్‌ను వైద్యశాలకు తీసుకెళ్తున్న స్థానికులు

ఉలవపాడు: వినాయక చవితి పండుగ సందర్భంగా మండల కేంద్రం ఉలవపాడులో టీడీపీ నాయకుడు రికార్డింగ్ డ్యాన్స్ ఏర్పాటు చేశారు. కూటమి అధికారంలో ఉందని ఎలాంటి అనుమతులు లేకపోయినా టీడీపీ నాయకుడు ట్రాక్టర్‌పై గ్రామం అంతా తిరిగే డ్యాన్స్ ఏర్పాటు చేశాడు. స్థానిక గంగమిట్టలోని వినాయకుడి గుడి ఆధ్వర్యంలో ధర్మకర్తగా ఉన్న టీడీపీ నాయకుడు చిలకలూరిపేటకు చెందిన ఎనిమిది మంది అమ్మాయిలతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాడు. కోనేరు వద్దకు రావడంతో ట్రాక్టర్‌కు అమర్చి ఉన్న జనరేటర్ ఫ్యాన్‌లో ఓ డ్యాన్సర్ చున్నీ పడింది. చివరకు ఆమె జనరేటర్‌పై పడిపోయింది. గాయాలై స్పృహ తప్పి పడిపోయింది. అప్పటికప్పుడు వెంటనే కారులో స్థానికంగా ఉన్న సరయు వైద్యశాలకు తరలించారు. ఉదయం వరకు చికిత్స పొందిన తర్వాత వారి గ్రామానికి తీసుకెళ్లిపోయారు. ఎలాంటి అనుమతులు లేకుండా రికార్డింగ్ డ్యాన్స్ నిర్వహించడంతో పాటు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతో డ్యాన్సర్‌కు గాయాలయ్యాయి.

అనుమతి లేకుండానే..

రికార్డింగ్ డ్యాన్స్‌కు ఎలాంటి అనుమతులు లేవు. డీజేకు అనుమతిలేదు. అయినా టీడీపీ నాయకుడు మాత్రం తాను డ్యాన్స్ పెడతానని ముందే ప్రకటించాడు. మండల పరిధిలో 30 పోలీస్ యాక్టు అమలులో ఉంది. అయినా సదరు నాయకుడు చిలకలూరిపేటకు చెందిన అమ్మాయిలతో డ్యాన్స్ వేయించాడు. రికార్డింగ్ డ్యాన్స్ ఏర్పాటు చేస్తున్నారని, అది వద్దని అదే కాలనీకి చెందిన వారు కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యానికి నాలుగు రోజుల క్రితమే ఫిర్యాదు చేశారు. అయినా పోలీసు శాఖ ఏ మాత్రం పట్టించుకోలేదు. పోలీసు వాహనం కూడా వచ్చి దగ్గర ఉన్నా డ్యాన్స్ వేశారు. టీడీపీ నాయకుడి అత్యుత్సాహానికి పెద్ద ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన తర్వాత కూడా డ్యాన్స్ నిర్వహించడం విశేషం. ఎస్సై అంకమ్మకు ప్రమాదం జరిగిందని స్థానికులు ఫోన్ చేయడంతో ఆయన వచ్చి నిలుపుదల చేయించారు. అనుమతి లేకుండా రికార్డింగ్ డ్యాన్స్ నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దివ్యాంగుల సీట్లలో వారినే కూర్చోనివ్వాలి

ఒంగోలు వన్‌టౌన్: దివ్యాంగులకు కేటాయించిన సీట్లలో వారినే కూర్చోనివ్వాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి అధ్యక్షుడు ఎస్‌కే కాలేషా ఏపీఎస్‌ఆర్‌టీసీ జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు అధికారి జి.సత్యనారాయణను కోరారు. శనివారం ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందించారు. జాతీయ దివ్యాంగుల చట్టం 2016 ప్రకారం బస్సులో దివ్యాంగులకు కేటాయించిన సీట్లలో వారినే కూర్చోనివ్వాలన్నారు. కానీ, కండక్టర్లను అడిగితే దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని తగ్గించే విధంగా మాట్లాడుతున్నారన్నారు. దివ్యాంగులకు కేటాయించిన సీట్లలో వారే కూర్చునే విధంగా అన్ని డిపోల మేనేజర్లకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

పాత్రికేయులు వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలి

● ప్రెస్ అకాడమీ చైర్మన్ సురేష్‌కుమార్



మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ సురేష్‌కుమార్

మార్కాపురం టౌన్: పాత్రికేయులు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఏపీసీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ సూచించారు. శనివారం మార్కాపురంలోని సౌజన్య కల్యాణ మండపంలో అకాడమీ ఆధ్వర్యంలో గ్రామీణ విలేకరులకు పునశ్చరణ తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సురేష్‌కుమార్ మాట్లాడుతూ పాత్రికేయ వృత్తిలో స్థాయి పెంచాలనే లక్ష్యంతో అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జర్నలిజంలో నైతిక విలువలు పాటించాలని, వాస్తవాలను ప్రచురించాలని సూచించారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ పోలీసులు, పాత్రికేయుల మధ్య మంచి సంబంధాలు ఉండాలని, సమాజంలో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకుని వార్తలు ఇవ్వాలని కోరారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐజేయూ జాతీయ కార్యదర్శి సోమసుందర్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, కార్యదర్శి సురేష్, జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ రమణ, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు వెంకట్రావు, జిల్లాలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి, ఒంగోలుకు చెందిన పాత్రికేయులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న కిరణ్ కుమార్ రెడ్డి

ఒంగోలు సబర్బన్: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ కుమార్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒంగోలు నగరంలోని బందరు రోడ్డులోని శారదా బాల కుటీర్ వార్డు సచివాలయంలో ఏపీజీఈఏ శనివారం రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రత్యేకంగా గత ప్రభుత్వం వార్డు, గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసిందన్నారు. సచివాలయాల ఉద్యోగుల ప్రయోజనాలు దెబ్బతినకుండా యూనియన్ పోరాటం చేస్తుందని చెప్పారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే పీఆర్‌సీని ప్రభుత్వం ప్రకటించాలన్నారు. ఉద్యోగులకు సరెండర్ లీవ్స్ నగదు రూపంలో రావాల్సి ఉందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన డీఏలు ప్రభుత్వం బకాయి ఉందన్నారు. ఇవన్నీ ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే పరిస్థితి లేదని, తరువాత ఏవిధమైన కార్యాచరణ చేపడదామన్న అంశంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి ఏపీజీఈఏ ఆధ్వర్యంలో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తారన్నారు. ఏపీజీఈఏ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రతి విభాగంలో అందరితో చర్చించిన మీదట ఎలాంటి కార్యాచరణ చేపట్టాలో నిర్ణయం తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి వరకుమార్, కోశాధికారి రంగారెడ్డి, ఒంగోలు పట్టణ అధ్యక్షుడు మోటా శ్రీనివాసరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ రజిత మానస, సంఘ నాయకులు జిల్లా చంద్రశేఖర్, కొనికి శ్రీనివాసులు, నివేదిత అలెక్స్, సుజాతలతోపాటు సచివాలయ ఉద్యోగులు ప్రభాకర్, గోపి, వినయ్, వెంకటేష్, సురేష్, స్వాతి, అబ్బయ్య, అర్చన, మీనా, తిరుపతయ్య, వినయ్, సరితతో పాటు తదితరులు పాల్గొన్నారు.